సాక్షి

భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 3 । సెప్టెంబర్ । 2025

గరిష్టం / కనిష్టం
28° / 24°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉంది.



‘మహా’ నివాళి..

దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అభిమానులు ఘనంగా నివాళులర్పించారు.

9లో

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయ స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. కాగా, ఏపీలోని ఆముదాల వలస ఎమ్మెల్యే కూనా రవికుమార్ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీసీతారామచంద్ర స్వామిని దర్శించుకున్నారు. వీరికి అర్చకులు స్వాగతం పకలగా ఆలయ ప్రదక్షిణ అనంతరం మూలమూర్తులను దర్శించుకున్నారు.

సివిల్ సర్వీసెస్ టోర్నీకి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంటౌన్: ఈనెల 9వ తేదీ నుంచి నిర్వహించే ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నీలో పాల్గొనేందుకు ఉద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి తెలిపారు. రాష్ట్ర స్థాయిలో 19 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈనెల 9, 10వ తేదీల్లో హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్స్, ఎల్‌బీ స్టేడియంలో వివిధ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 4వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని, వివరాలకు 95054 23226 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి



పేషెంట్లతో మాట్లాడుతున్న జయలక్ష్మి

బూర్గంపాడు: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ జయలక్ష్మి ఆదేశించారు. మోరంపల్లిబంజర పీహెచ్‌సీలో మంగళవారం ఆమె రికార్డులు తనిఖీ చేశారు. ఫార్మసీ గది, ఇన్‌పేషెంట్ వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. వానాకాలంలో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. 24 గంటలూ వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీసాహితి, సిబ్బంది పాల్గొన్నారు.

నెమ్మదిగా తగ్గుతున్న గోదావరి

భద్రాచలంటౌన్ : భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం నెమ్మదిగా తగ్గుతూ మంగళవారం రాత్రి 9.30 గంటలకు 40 అడుగులకు చేరింది. ఎగువన ఉన్న ప్రాజెక్టుల నుంచి వదరనీటి ప్రవాహం తగ్గింది. సోమవారం రాత్రి నీటి మట్టం 42 అడుగులు ఉండగా 24 గంటల వ్యవధిలో ప్రవాహం రెండడుగుల మేర తగ్గింది. ఎగువన ఉన్న ప్రాజెక్టుల నుంచి వరద లేకపోవడంతో గోదావరి నీటి ప్రవాహం మరింత తగ్గే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు.

బీఈడీలో ప్రవేశాలకు అర్హుల జాబితా విడుదల

భద్రాచలం: భద్రాచలం గిరిజన బీఈడీ కళాశాలలో 2025 – 2027 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఎంపికైన వారి జాబితా విడుదల చేసినట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. డీడీ మణెమ్మ, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ వీరునాయక్ సమక్షంలో మెరిట్ జాబితాను మంగళవారం తన చాంబర్‌లో ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిగ్రీ పార్ట్– 2లో వచ్చిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పించామని చెప్పారు. 100 సీట్లకు గాను 500 దరఖాస్తులు వచ్చాయని, నిబంధనల ప్రకారం భర్తీ చేశామని తెలిపారు. సీటు సాధించిన విద్యార్థులను త్వరలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని వెల్లడించారు.

సారూ.. ఇటు చూడరూ

- మూడేళ్ల క్రితం ప్రారంభమైన సత్తుపల్లి – పెద్దపల్లి రైల్వే లైన్
- ఈ లైన్‌లో జోరుగా బొగ్గు రవాణా
- రూ.కోట్లు ఆర్జిస్తున్న రైల్వే శాఖ

ప్రయాణికుల రైలు ఏర్పాటుపై మాత్రం నిర్లక్ష్యమే..



ప్యాసింజర్ రైళ్లు నడవని సత్తుపల్లి - భద్రాచలంరోడ్ లైన్..

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు చంద్రుగొండ నుంచి బెండాలపాడుకు రోడ్డు మార్గంలో వెళ్లనున్నారు. మధ్యలో సత్తుపల్లి – భద్రాచలం రోడ్డు రైల్వే లైన్‌ను క్రాస్ చేయాల్సి ఉంటుంది. ఈ మార్గం మూడేళ్ల క్రితం అందుబాటులోకి వచ్చినా ఇప్పటి వరకు కేవలం గూడ్సు రైళ్లకే పరిమితమైంది. ప్రయాణికుల రైళ్లు నడిపేందుకు మాత్రం రైల్వేశాఖ ప్రయత్నించడం లేదు. కనీసం ఈ మార్గంలో బుధవారం ప్రయాణించే ప్రజాప్రతినిధులైనా ఈ అంశంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

మూడేళ్లుగా గూడ్సులే..

సత్తుపల్లి – భద్రాచలం రోడ్డు రైల్వేలైను నిర్మాణ వ్యయం రూ.928 కోట్లు కాగా ఇందులో రూ.619 కోట్లు సింగరేణి సంస్థ సమకూర్చింది. ట్రాక్ నిడివి 54 కిలోమీటర్లు ఉండగా ఈ మార్గంలో సర్వారం, చంద్రుగొండ, పార్థసారధిపురం (సత్తుపల్లి) స్టేషన్లు నిర్మించారు. ఈ లైన్ 2022 నవంబర్‌లో జాతికి అంకితమైంది. అంతకుముందే 2022 మే 28 నుంచే గూడ్సు రైళ్ల ద్వారా బొగ్గు రవాణాకు అనుమతి ఇచ్చారు. ఈ లైన్ ద్వారా నిత్యం 30 వేల టన్నుల బొగ్గు రవాణా జరుగుతోంది. వార్షిక రవాణా సామర్థ్యం పది మిలియన్ టన్నులుగా ఉంది. ఈ లైనులో సరుకు రవాణా ద్వారా రైల్వేకు సాలీనా రూ.200 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది.

సేఫ్టీ సర్టిఫికెట్ వచ్చాకే..

నిర్మాణ వ్యయంలో సింహభాగం సింగరేణి నుంచి తీసుకోవడం, ఆ సంస్థ బొగ్గు రవాణా చేస్తూ లాభాలు ఆర్జించడం తప్పితే సింగరేణి కార్మికులు, స్థానిక గిరిజనుల రవాణా అవసరాలు తీర్చడంపై మాత్రం రైల్వేశాఖ దృష్టి సారించడం లేదు. నిబంధనల ప్రకారం ఏదైనా కొత్త లైన్‌లో కొన్నాళ్ల పాటు గూడ్స్ రైళ్లు నడిచిన తర్వాత ప్యాసింజర్ రైళ్లు నడిపే ప్రక్రియ మొదలవుతుంది. అందులో భాగంగా ఈ ట్రాక్‌పై ప్యాసింజర్ రైళ్లను కొంత కాలం పాటు ప్రయోగాత్మకంగా నడిపించాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా ప్యాసింజర్ రైళ్లు ఎన్ని బోగీలతో, ఎంత వేగంతో నడిపించవచ్చు, ఎక్కడ వేగాన్ని తగ్గించాలి, ఎక్కడ పెంచాలి తదితర అంశాలను పరిశీలిస్తారు. ఆ తర్వాత ప్రయాణికుల రైళ్లకు ట్రాక్ అనుకూలంగా ఉందా లేదా అని అంచనా వేసి తగు మార్పులు చేస్తారు. ఆ తర్వాత సేఫ్టీ సర్టిఫికెట్ కోసం రైల్వే బోర్డుకు దరఖాస్తు చేస్తారు. అక్కడి నుంచి అనుమతులు వచ్చాక ప్రయాణికుల రైళ్లు పట్టాలెక్కుతాయి. అయితే ఈ మార్గంలో గూడ్సు రైళ్లు దాదాపు మూడేళ్లుగా తిరుగుతున్నా ఇప్పటి వరకు ప్రయాణికుల రైళ్లు నడిపించేందుకు సేఫ్టీ సర్టిఫికెట్ కోసం ప్రయత్నాలు జరగడం లేదు. ఫలితంగా కొత్తగా నిర్మించిన రైల్వే స్టేషన్లు అలంకార ప్రాయంగా మారాయి.

సత్తుపల్లి టు పెద్దపల్లి

బొగ్గు గనులకు పుట్టిల్లుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు పేరుంది. అలాగే పెద్దపల్లి జిల్లా రామగుండం రీజియన్, ఆ పొరుగునే ఉన్న మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి రీజియన్‌లో సుమారు 30 వేల మంది సింగరేణి కార్మికులు పని చేస్తున్నారు. సత్తుపల్లి, కొత్తగూడెం ప్రాంతాలను పెద్దపల్లి – మంచిర్యాల జిల్లాలతో అనుసంధానం చేసేలా సత్తుపల్లి నుంచి పెద్దపల్లి లేదా బెల్లంపల్లి వరకు పగటి వేళ పుష్‌పుల్ రైలు నడిపించాలని నాలుగు జిల్లాల ప్రజలు కోరుతున్నారు. గతంలో మణుగూరు నుంచి కాజీపేట వరకు ఉదయం వేళ ప్యాసింజర్ రైలు ఉండేది. పెద్దపల్లి నుంచి విజయవాడ వరకు మరో బైవీక్లీ ప్యాసింజర్ రైలు అందుబాటులో ఉండేది. కరోనా సమయంలో ఈ రెండు రైళ్లు రద్దవగా ఇప్పటికీ పునరుద్ధరించలేదు. కనీసం ఈ రైళ్లకు ప్రత్యామ్నాయంగానైనా సత్తుపల్లి – పెద్దపల్లి మధ్య రైలు నడిపించాలని, ఆ మేరకు ప్రజాప్రతినిధులు రైల్వేశాఖపై ఒత్తిడి తేవాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా వాసులు డిమాండ్ చేస్తున్నారు.

సీఎం పర్యటనకు సర్వం సిద్ధం

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొంగులేటి

చంద్రుగొండ/అశ్వారావుపేట : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనకు సర్వం సిద్ధమైంది. వరుసగా రెండుసార్లు వాయిదా పడిన సీఎం పర్యటన ఎట్టకేలకు బుధవారం ఖరారైంది. నేడు మధ్యాహ్నం 2.20 గంటలకు చంద్రుగొండ మండలంలోని బెండాలపాడుకు చేరుకుని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించనున్నారు. కాగా, సీఎం పర్యటన ఏర్పాట్లను రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూర్తిగా మారుమూల గిరిజన గ్రామమైన బెండాలపాడులోనే ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టాలని సీఎం నిర్ణయం తీసుకున్నారని, ఇందిరమ్మ ప్రజాపాలనకు ఇదే నిదర్శనమని అన్నారు. సీఎం పర్యటనను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వరుసగా వర్షాలు కురుస్తున్నా అధికారులు సభ ఏర్పాట్లను సమర్థంగా పూర్తి చేశారని అభినందించారు. గత పదేళ్ల కేసీఆర్ పాలనలో పేదోళ్లకు ఒక్క ఇల్లు కూడా రాలేదని, డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరిట ప్రజాధనం దోపిడి చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో తొలివిడతగా రాష్ట్రంలో 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామని, అందులో 2.90 లక్షల ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. బిల్లుల చెల్లింపులోనూ పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని, ఎక్కడైనా తప్పులు జరిగితే ఏసీబీ విచారణకు అప్పగించామని చెప్పారు. సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో అశ్వారావుపేట, భద్రాచలం, ఇల్లెందు ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, తెల్లం వెంకట్రావ్, కోరం కనకయ్య, ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, గృహ నిర్మాణ శాఖ ఎండీ గౌతమ్, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ట్రెయినీ కలెక్టర్ సౌరభ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

అంతా బురదమయం..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన ఇప్పటికి రెండుసార్లు వాయిదా పడినా.. సభా ప్రాంగణం వద్ద పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. టెంట్ల కింద వరద నీరు నిలిచిపోయి ఉంది. మరి సీఎం వచ్చే సమయానికైనా బురద నీటిని తొలగిస్తారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాక్షాత్తూ సీఎం వస్తున్నా.. అధికారుల్లో నిర్లక్ష్యం వీడలేదన్నట్టుగానే అసంపూర్తి పనులు దర్శనమిస్తున్నాయి. చంద్రుగొండలో జాతీయ రహదారి వెంట పోగేసిన చెత్త కుప్పలు అలాగే వదిలేయడం గమనార్హం.



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, పక్కన ఎమ్మెల్యేలు ఆదినారాయణ, కనకయ్య



సభా ప్రాంగణంలో పేరుకుపోయిన బురదనీరు

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

కొత్తగూడెంఅర్బన్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కార్యక్రమ విజయవంతానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సభా ప్రాంగణంలో తాగునీరు, వైద్య సహాయం, భద్రత ఏర్పాట్లు చేయాలని, మధ్యాహ్నం 12 గంటలలోపే బస్సులు సభా ప్రాంగణానికి చేరుకునేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ప్రతీ బస్సుకు ఒక ఇన్‌చార్జ్‌ను నియమించాలన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

పాల్వంచ: తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఎన్నికలు స్థానిక ఇంజనీర్స్ అసోసియేషన్ హాల్‌లో మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించిన పోలింగ్‌లో 305 మందికి గాను 278 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. జెన్‌కో, ట్రాన్స్‌కో, ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ ఏఈలు పోలింగ్‌లో పాల్గొన్నారు. జనరల్ సెక్రటరీగా టి.మహేష్, ఫైనాన్స్ సెక్రటరీగా జి.శ్రీపాల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిసింది. రాష్ట్రంలోని 25 చోట్ల ఎన్నికలు నిర్వహించగా ఈనెల 19న పాల్వంచలోనే ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారులుగా బి.రవి, జి.తేజస్వి, ఆర్.రమేష్, కె.మనోజ్, ఐ.రాజు వ్యవహరించారు.



పోలింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది

ముగిసిన నామినేషన్ల పర్వం..

కేటీపీఎస్, బీటీపీఎస్, వైటీపీఎస్ ఉద్యోగుల క్రెడిట్ సొసైటీ(పాల్వంచ) ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ మంగళవారం ముగిసింది. 3,008 మంది సభ్యులున్న ఈ సొసైటీకి 13 డైరెక్టర్ పోస్టులకు మొత్తం 46 మంది నామినేషన్లు దాఖలు చేశారు.

పంటలను పరిశీలించిన ట్రెయినీ కలెక్టర్

టేకులపల్లి : ట్రెయినీ కలెక్టర్ సౌరభ్‌శర్మ టేకులపల్లి మండలంలో మంగళవారం పర్యటించారు. గోలియాతండాలో పత్తి పంటలను పరిశీలించి.. ఇప్పటివరకు పెట్టుబడి ఎంత పెట్టారు, ప్రస్తుతం పంట పరిస్థితి ఎలా ఉంది అని రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల వ్యవసాయ కార్యాలయంలో అధికారులతో సమావేశం అయ్యారు. ఈ ప్రాంత భౌగోళిక స్వరూపం, నూతన వ్యవసాయ పద్ధతులు, నేలల స్వభావం, పంటల విస్తీర్ణం, రైతు భరోసా, రైతు బీమా పథకాల అమలు, మార్కెటింగ్ తదితర అంశాలపై చర్చించారు. రైతులకు వ్యవసాయ రుణాలు సక్రమంగా అందుతున్నాయా, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎన్ని ఏర్పాటు చేస్తారనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏడీఏ గుగులోత్ లాల్‌చంద్, ఏఓ అన్నపూర్ణ, ఆత్మ చైర్మన్ బోడా మంగీలాల్, ఏఈఓలు శ్రావణి, విశాల, రమేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



గోలియాతండాలో పత్తి పంటను పరిశీలిస్తున్న సౌరభ్‌శర్మ

కేసీఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం : రేగా

మణుగూరు రూరల్: కొద్ది రోజులుగా ఎమ్మెల్సీ కవిత పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని, ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ బీఆర్‌ఎస్ అధినేత తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు తెలిపారు. పార్టీ కంటే ఎవరూ పెద్ద కాదనే విషయం ఈ నిర్ణయంతో స్పష్టమైందని ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు.

వ్యాపార సముదాయాలకు వేలం

నెలకు రూ.3.14 లక్షలకు ఖరారైన నం.1 షాప్

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయ ప్రాంగణంలోని పలు వ్యాపార సముదాయాలకు మంగళవారం వేలం నిర్వహించారు. అన్ని దుకాణాలకు 11 నెలల పాటు లైసెన్స్ హక్కులు పొందేందుకు గాను సీల్డ్ టెండర్ కం వేలంపాట పెట్టగా.. పాత కాంప్లెక్స్‌లోని ఒకటో నంబర్ షాప్‌నకు నెలకు రూ.3.14 లక్షల చొప్పున కేశవాపురం గ్రామానికి చెందిన సామినేని వెంకన్న అనే వ్యాపారి కైవసం చేసుకున్నారు. ఈ దుకాణానికి గతేడాది కూడా నెలకు రూ.3.11 లక్షలు పలకడం విశేషం. ఇక కొత్త కాంప్లెక్స్‌లోని 1, 2 షాపులకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఈనెల 15కు వాయిదా వేసినట్లు ఈఓ రజనీకుమారి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, ఉమాసోమలింగేశ్వరస్వామి ఆలయ ఈఓ వి.ఎల్.వి.వెంకట్రావ్, ధర్మకర్తలు పెండ్లి రామిరెడ్డి, చెవుగాని పాపారావు, భూక్యా గిరిప్రసాద్ పాల్గొన్నారు.

శాంతి భద్రతలపై నిఘా : ఎస్పీ

చంద్రుగొండ : సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో పటిష్టనిఘా ఏర్పాటుచేసినట్లు ఎస్పీ రోహిత్‌రాజ్ తెలిపారు. మండలంలోని అయన్నపాలెంలో మంగళవారం ఆయన పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. పోలీసులు అప్రమత్తంగా ఉండి సీఎం సభ సజావుగా సాగేలా చూడాలని సూచించారు. సమావేశంలో ఓఎస్‌డీ నరేందర్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు డీఎస్పీలు అబ్దుల్ రహమాన్, సతీష్‌కుమార్, చంద్రభాను పాల్గొన్నారు.

‘ఆది కర్మయోగి’ని గిరిజనుల చెంతకు చేర్చాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్

భద్రాచలం: సేవ, సంకల్ప, సమర్పణ అనే లక్ష్యంతో ప్రభుత్వం అందజేస్తున్న ఆది కర్మయోగి అభియాన్ పథకాన్ని గిరిజనుల చెంతకు చేర్చేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహిస్తున్న మండల స్థాయి శిక్షణ కార్యక్రమానికి మంగళవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల గిరిజనుల ఆచారాలు, జీవన శైలి విభిన్నంగా ఉంటాయని, వారి సమస్యలు తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. గ్రామసభలు నిర్వహించి విద్య, వైద్యం, వ్యవసాయం, తాగునీరు, మేకల పెంపకం, మునగ సాగు, జీవిత బీమా, ఆది సురక్ష బీమా వంటి పథకాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇక్కడ శిక్షణ పొందుతున్న ప్రతి ఒక్కరూ నిబద్ధతగా విధులు నిర్వర్తించాలన్నారు. పీఓ రాహుల్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రతీ గిరిజన కుటుంబానికి చేరేలా కృషి చేయాలన్నారు. గిరిజనుల జీవనోపాధి పెంపునకు రూపొందించిన ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈనెల 9, 10 తేదీల్లో గ్రామాల్లో పర్యటించాలని, 19 మండలాల్లోని 130 గ్రామాలలో పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనినా, డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి, ఏఓ సున్నం రాంబాబు, మాస్టర్ శిక్షకులు మధువన్, మాధవరావు, జస్వంత్ ప్రసాద్, సంతోష రూపా, సలీం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, పక్కన పీఓ రాహుల్ తదితరులు

తెల్లవారకముందే చెప్పులతో క్యూలైన్

■ తప్పని యూరియా పాట్లు



యూరియా విక్రయ కేంద్రం వద్ద చెప్పులతో క్యూ లైన్లు..

‘వ్యవసాయ పనులు పక్కన పెట్టి యూరియా కోసం రోజూ వస్తున్నాం.. ఒక బస్తా ఇచ్చేందుకు మూడు రోజులుగా గోసపెడుతున్నారు’ అంటూ రైతులు యూరియా విక్రయాల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నిజాంపేట విక్రయ కేంద్రానికి మూడు రోజులుగా యూరియా సరఫరా నిలిచిపోయింది. మంగళవారం కూడా విక్రయించడం లేదని తెలిసి.. చెప్పులు క్యూలో ఉంచి ఆందోళనకు దిగారు. వ్యవసాయ శాఖ అధికారులు వారికి నచ్చజెప్పి.. బుధవారం తప్పకుండా ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు మంగళవారమే టోకెన్లు పంపిణీ చేయగా వాటి కోసం తోపులాట, తొక్కిసలాట చోటుచేసుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ యూరియా విక్రయ కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. అన్నదాతల అవసరాలను గుర్తించి సకాలంలో యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వ అసమర్థత వల్లే రైతులు యూరియా కోసం ఇబ్బంది పడుతున్నారని అన్నారు.

–ఇల్లెందురూరల్

పల్లె ఓటర్లు @ 6,69,048

- ఎట్టకేలకు లెక్క తేల్చిన అధికారులు
- జిల్లాలో తుది ఓటరు జాబితా ప్రచురణ
- గతం కంటే 45,101 మంది ఓటర్లు అధికం



రుద్రంపూర్ పంచాయతీలో ఓటరు జాబితాలను ప్రదర్శిస్తున్న సిబ్బంది

చుంచుపల్లి: జిల్లాలోని పల్లె ఓటర్ల లెక్క 6,69,048గా తేలింది. గ్రామపంచాయతీలకు త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వార్డుల వారీగా తయారుచేసిన తుది ఓటరు జాబితాను పంచాయతీ అధికారులు మంగళవారం ప్రకటించారు. దీంతో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ప్రధాన అంకం మొదలైంది. దాదాపు తొమ్మిది నెలల తర్వాత రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇటీవల మరోసారి మార్పులు, చేర్పుల అనంతరం తుది ఓటర్ల జాబితాను ప్రచురించారు. ఈ క్రమంలో గత నెల 28న మొదట ముసాయిదా జాబితాలు ప్రచురించాక మండల, జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించారు. అలాగే అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించారు.

మహిళలే అధికం..

జిల్లాలోని 471 గ్రామ పంచాయతీల పరిధిలోని 4,168 వార్డులకు సంబంధించిన జాబితాలను అధికారులు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 6,69,048 మంది ఓటర్లు ఉన్నట్లు తేల్చారు. ఇటీవల పంచాయతీల వారీగా చేపట్టిన ఓటర్ల జాబితా సవరణతో పోల్చితే తాజా జాబితాలో 45,101 మంది ఓటర్లు పెరిగారు. మొత్తం ఓటర్లలో పురుషులు 3,25,045 మంది, మహిళలు 3,43,979 మంది, ఇతరులు 24 మంది ఉన్నారు. పురుషుల కంటే 18,934 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో తుది ఓటరు జాబితాలను అందుబాటులో ఉంచారు. ఎక్కువ శాతం గిరిజన జనాభా ఉన్న పంచాయతీల్లో ఎస్టీలకే సర్పంచ్, వార్డు స్థానాల్లో రిజర్వేషన్ కల్పించనున్నారు. పంచాయతీ ఓటర్ల తుది జాబితా సిద్ధం కావడంతో ఇక గ్రామాల్లో రాజకీయాలు వేడెక్కనున్నాయి.


స్వాగతం... సుస్వాగతం...
ఇందిరమ్మ ఇంటితో ...
నిరుపేదల ముఖంలో చిరునవ్వు వచ్చే...
భద్రాద్రి రాముని సాక్షిగా...
ఇచ్చిన మాటను నిజం చేస్తూ...
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బెండాలపాడు గ్రామాన్ని
పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని ఒక్క పూరి గుడిసె
కూడా లేకుండా ఇందిరమ్మ ఇళ్ళను అందరికి
మంజూరు చేసి, నేడు గృహ ప్రవేశము
చేయుటకు విచ్చేయుచున్న
గౌ॥ ముఖ్యమంత్రివర్యులు
శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి
గౌ॥ ఉప ముఖ్యమంత్రివర్యులు
శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారికి
గౌ॥ రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖామాత్యులు
శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారికి
గౌ॥ వ్యవసాయ శాఖామాత్యులు
శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారికి
మరియు ఇతర నాయకులకు ఇవే మా
స్వాగత సుమాంజలులు....
గౌ॥ శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారు
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
గౌ॥ శ్రీ భట్టి విక్రమార్క మల్లు గారు
తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,
ఆర్థిక మరియు విద్యుత్ శాఖామాత్యులు
యరమల
పూర్ణచంద్రారెడ్డి (KPR)
భీమవరం గ్రా॥, ఎర్రుపాలెం మం॥,
ఖమ్మం జిల్లా.